నమస్తే తెలంగాణ
ఆదిలాబాద్
3 నిజామాబాద్, గురువారం 29 ఫిబ్రవరి 2024 ADILABAD

## హన్మంతరెడ్డి అందరికీ ఆదర్శం

**మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి**


మాట్లాడుతున్న మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 28 : హన్మంతరెడ్డి అందరికీ ఆదర్శమని, ఉన్నత విలువలతో జీవితం గడిపిన వ్యక్తి అని మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఎల్లపెల్లిలో హన్మంతరెడ్డి పదో రోజు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి కుటుంబ సభ్యులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ.. కుటుంబానికి వ్యాపారపరంగా ఆదర్శంగా నిలిచారని, తమ కుటుంబం రాజకీయాల్లోకి రాకముందే వ్యాపార రంగంలో క్రియాశీలకంగా వ్యవహరించిందని తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు.

## ఆదిలాబాద్ కలెక్టర్ బదిలీ

**● నూతన కలెక్టర్‌గా రాజర్షి షా ● ఆర్డీవోకూ స్థానచలనం**


నూతన కలెక్టర్ రాజర్షి షా

ఆదిలాబాద్, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్ బదిలీ అయ్యారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో మూడేండ్లుగా పనిచేస్తున్న అధికారుల బదిలీ నేపథ్యంలో తప్పనిసరిగా మారింది. గతంలో కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్‌గా పనిచేసిన రాహుల్‌రాజ్ ఏడాది కాలంగా ఆదిలాబాద్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. రెండు జిల్లాలు ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలోకి రావడంతో ప్రభుత్వం ఆయనను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కొత్త కలెక్టర్‌గా మెదక్ కలెక్టర్ రాజర్షి షాను ప్రభుత్వం నియమించింది. ఆదిలాబాద్ ఆర్డీవోగా పనిచేస్తున్న స్రవంతి కూడా బదిలీ అయ్యారు. వరంగల్ ఆర్టీవోగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మెదక్ ఆర్డీవోగా పనిచేస్తున్న అంబాదాస్ రాజేశ్వర్ ఆదిలాబాద్ ఆర్డీవోగా నియమితులయ్యారు.


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్

## ఇంటర్ పరీక్షలు ప్రారంభం

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 28 : ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. నిర్మల్, భైంసా డివిజన్‌లలో 23 పరీక్షా కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం 6,999 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా.. 6,465 మంది పరీక్ష రాశారు. 534 మంది గైర్హాజరయ్యారు. నిమిషం నిబంధన అమలులో ఉండడంతో పలువురు విద్యార్థులను కేంద్రంలోకి అనుమతించలేదు.

### తనిఖీ చేసిన కలెక్టర్

నిర్మల్ పట్టణంలోని శాంతినగర్ కాలనీలో గల ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేశారు. మాస్ కాపీయింగ్ జరుగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని డీఐఈవో పరశురాంకు సూచించారు.

### ఆదిలాబాద్ జిల్లాలో..

ఆదిలాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 : ఇంటర్ పరీక్షలు బుధవారం నుంచి ప్రారంభం అయ్యాయి. గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల(బాలుర)ను కలెక్టర్ రాహుల్ రాజ్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు, సీసీ కెమెరాలు, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. విద్యుత్ అంతరాయం లేకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా మొదటి సంవత్సరం 10,424 మందికి 9,690 మంది హాజరయ్యారని, 734 మంది గైర్హాజరయ్యారని తెలిపారు.


పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

# ఎల్‌ఆర్‌ఎస్.. గడువులోపు కష్టమే

## మున్సిపాలిటీలను వేధిస్తున్న సిబ్బంది కొరత

- 11 మున్సిపాలిటీల్లో 66,095 దరఖాస్తులు పెండింగ్
- 50 నుంచి 60 శాతం వరకే చేయగలమంటున్న అధికారులు
- ఖజానా నింపుకోవడం కోసం సాధ్యం కాని టార్గెట్ పెట్టిందంటున్న పలువురు
- ఎల్ ఆర్‌ఎస్ రద్దుపై పెట్టుకున్న ఆశలు గల్లంతు.. మాట మార్చిన కాంగ్రెస్ సర్కార్



మంచిర్యాల, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కాంగ్రెస్ సర్కారు కాసుల వేటలో పడింది. పైసల్ లేవు, అప్పులయ్యాయని చెప్పుకుంటూ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు మంగళం పాడే పనిలో పడింది. కాగా.. ఎల్‌ఆర్‌ఎస్‌పై మాట మార్చి జనాలకు షాక్ ఇచ్చింది. అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్(లే అవుట్ రెగ్యులరైజేషన్ స్కీం)ను ఉచితం చేస్తామని, ఎవ్వరూ ఎల్‌ఆర్‌ఎస్ కట్టొద్దని చెప్పి ఇప్పుడు మాట మార్చింది. 2020లో దరఖాస్తు చేసుకున్న వారు పూర్తి రుసుం చెల్లించి లే-అవుట్‌లను క్రమబద్ధీకరించుకోవాలని ప్లేట్ ఫిరాయించింది. దీంతో కాంగ్రెసొస్తే ఉచితంగా లే-అవుట్‌లు, ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవచ్చని జనాలు పెట్టుకున్న ఆశలు గల్లంతయ్యాయి. 2020 ఆగస్టు నుంచి అక్టోబర్ 31 వరకు అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రెండు నెలలపాటు ఎల్‌ఆర్‌ఎస్‌కు దరఖాస్తులు స్వీకరించింది. వచ్చిన దరఖాస్తుల్లో కొన్నింటిని పరిష్కరించగా.. కోర్టు కేసుల కారణంగా ఈ ప్రక్రియ ఆగింది. తాజాగా.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్‌ఆర్‌ఎస్‌కు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినప్పటికీ నెల రోజుల గడువు మాత్రమే ఇవ్వడం, పైగా పైసలు కట్టాలనడంతో గడువు లోపు ఎల్‌ఆర్‌ఎస్ క్రమబద్ధీకరణ సాధ్యమయ్యేలా కనిపించడం లేదు.

### సిబ్బంది కొరత.. క్షేత్రస్థాయి పరిశీలన ఎలా..

ఎల్‌ఆర్‌ఎస్ కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి. ఈ పనిని మున్సిపాలిటీల్లోని టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది చేస్తారు. టౌన్ ప్లానింగ్ ఆఫీసర్లే ఇన్‌చార్జులుగా పని చేస్తున్నారు. అనుమతి ఇవ్వాలంటే ఎల్1, ఎల్2, ఎల్3 అని మూడు విభాగాలు ఉంటాయి. ఇందులో ఎల్1 అంటే టీపీబీవోలు క్షేత్రస్థాయికి వెళ్లి స్థలాన్ని చూశాకే నిర్ణయం తీసుకుంటారు. గ్రీన్‌జోన్, చెరువులు, కుంటలు, ప్రభుత్వ స్థలాలు, వక్ఫ్ భూములు ఉన్న స్థలాల్లో ప్లాట్లు ఏర్పాటు చేశారా? లేకపోతే అన్ని సరిగ్గానే ఉన్నాయా? అన్నది రిపోర్ట్ చేస్తారు. అలా పరిశీలించిన వాటిని రెండో దశలో ఎల్2లో టీపీవో, టీపీఎస్ సరిచూసుకుని ఒకే చేస్తేనే, మూడో దశ ఎల్3లో మున్సిపల్ కమిషనర్ వాటికి ఆమోద ముద్ర వేస్తారు. కానీ.. ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో టౌన్‌ప్లానింగ్ విభాగాల్లో ఈ పనులు చేసేందుకు సరిపడా సిబ్బంది లేరు. ఉదాహరణకు.. మంచిర్యాల మున్సిపాలిటీనే తీసుకుంటే దాదాపు కొన్ని నెలలుగా ఇక్కడ టీపీవో లేరు. ఇద్దరు టీపీఎస్‌లతోనే నడిపిస్తున్నారు. ఒకరికి మూడు రోజులు బెల్లంపల్లి, మూడు రోజులు మంచిర్యాల, మరొకరికి మూడు రోజులు మంచిర్యాల, మూడు రోజులు నస్పూర్‌లో విధులు నిర్వహిస్తున్నారు. మిగిలిన మున్సిపాలిటీల్లోనూ దాదాపు ఇదే పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు అత్యవసర పనులపై విచారణకు పంపాలనుకున్న సమయంలోనూ టీపీవోలు, టీపీఎస్‌లు ఆ రోజు విధుల్లో ఉండడం లేదు. దీంతో కార్యకలాపాలన్నీ పెండింగ్ పడుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో దాదాపు 66 వేల దరఖాస్తులను నెల రోజుల్లో పరిశీలించి క్లియరెన్స్ ఇవ్వడమేది సాధ్యం కాదని మున్సిపల్ అధికారులే చెప్తున్నారు. ప్రభుత్వ ఖజానా నింపుకోవడం కోసమే సాధ్యంకాని టార్గెట్‌ను పెట్టిందంటూ పెదవి విరుస్తున్నారు. గతంలో రెండు నెలల టైమ్‌లో సిబ్బంది కొరత లేకుండా ఉన్నప్పుడే ఉమ్మడి జిల్లాలో 22 వేల దరఖాస్తులను క్రమబద్ధీకరించిన అధికారులు, కొన్నింటిలో లోపాలను గుర్తించి రిజెక్ట్ కూడా చేశారు. ఇప్పుడు ఉన్న కొద్దిపాటి సిబ్బందితో నెల రోజుల్లో మూడింతల దరఖాస్తుల పరిశీలన కుదరదని ముఖం మీదే అధికారులు చెప్పేస్తున్నారు. అంతా కలిసిగట్టుగా శ్రమిస్తే 50 శాతం నుంచి 60 శాతం పూర్తి చేయగలమంటున్నారు. అది కూడా జనాలు నిర్దేశిత రుసులు చెల్లిస్తేనే వీలుపడుతుందంటున్నారు. మరి ఇలాంటి పరిస్థితుల్లో ఎల్‌ఆర్‌ఎస్‌పై ప్రభుత్వం ఎలా ముందుకు వెళ్తుందనేది వేచి చూడాలి.

**ఉమ్మడి జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఎల్ ఆర్‌ఎస్ దరఖాస్తుల వివరాలు**

| మున్సిపాలిటీ | వచ్చిన దరఖాస్తులు | పరిష్కరించినవి | పెండింగ్‌లో ఉన్నవి |
|---|---|---|---|
| ఆదిలాబాద్ | 19,430 | 5,222 | 14,208 |
| నిర్మల్ | 15,413 | 3,984 | 11,429 |
| ఖానాపూర్ | 1,910 | 1,184 | 7,26 |
| భైంసా | 10,800 | 1,950 | 8,850 |
| కాగజ్‌నగర్ | 1,845 | 150 | 1,695 |
| మంచిర్యాల | 22,954 | 4,021 | 18,933 |
| లక్షెట్టిపేట | 2,163 | 311 | 1,852 |
| చెన్నూర్ | 1,321 | 28 | 1,293 |
| నస్పూర్ | 4,921 | 4,024 | 897 |
| క్యాతన్‌పల్లి | 7,111 | 1,314 | 5,797 |
| బెల్లంపల్లి | 415 | 0 | 415 |
| మొత్తం | 88,283 | 22,188 | 66,095 |

### దరఖాస్తులు ఇలా..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో మొత్తం 12 మున్సిపాలిటీలు ఉన్నాయి. వీటిలో మందమర్రి మున్సిపాలిటీలో 1/17 యాక్ట్ అమలులో ఉంది. అక్కడ లే-అవుట్లు భూముల క్రయవిక్రయాలకు ఎలాంటి అవకాశం లేదు. అది మినహాయిస్తే మిగిలిన 11 మున్సిపాలిటీల్లో 2020లో ఎల్‌ఆర్‌ఎస్ కోసం 88,283 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 22,188 దరఖాస్తులను పరిష్కరించారు. మిగిలిన 66,095లో కొన్నింటిని తిరస్కరించగా, దాదాపు 66 వేల పైచిలుకు దరఖాస్తులకు క్లియరెన్స్ ఇవ్వాల్సి ఉంది. అత్యధికంగా మంచిర్యాల మున్సిపాలిటీలో 18,933, ఆదిలాబాద్‌లో 14,208, నిర్మల్‌లో 11,429, భైంసాలో 8,950, క్యాతన్‌పల్లిలో 5,797 అప్లికేషన్లు ఉన్నాయి.


నిర్మల్ మండలంలోని కొత్త పోచంపాడ్ పాఠశాలలో అర్ధాంతరంగా నిలిచిన తరగతి గదుల నిర్మాణ పనులు


నిర్మల్‌లోని మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో పిల్లర్లకే పరిమితమైన అదనపు తరగతి గదుల నిర్మాణం

# 'మన ఊరు-మన బడి' పనులకు బ్రేక్

- నిర్మల్ జిల్లావ్యాప్తంగా నిలిచిన పనులు
- పెండింగ్‌లో రూ.13 కోట్ల చెల్లింపులు
- పేమెంట్స్ కోసం కాంట్రాక్టర్ల ఎదురుచూపు

*ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలను కల్పించి, సమూల మార్పులు తీసుకొచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన 'మన ఊరు-మన బడి' కార్యక్రమానికి బ్రేక్ పడింది. పాఠశాలల్లో చేపడుతున్న పనులు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పనుల కొనసాగింపుపై నిర్ణయం తీసుకోలేదు. దీంతో ఆయా పనులపై సందిగ్ధత నెలకొన్నది. మరోవైపు పనులు పూర్తయినా బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. అయితే.. ప్రస్తుత ప్రభుత్వం కార్యక్రమాన్ని కొనసాగిస్తుందా? రద్దు చేస్తుందా? అనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది.*

నిర్మల్, ఫిబ్రవరి 28(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లా వ్యాప్తంగా 735 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా మొదటి విడుతలో 260 పాఠశాలలను ఎంపిక చేశారు. ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడం, అదనపు తరగతి గదులను నిర్మించడం వంటి పనులు చేపట్టారు. సివిల్ పనుల కోసం కేసీఆర్ ప్రభుత్వం రూ.82 కోట్లను మంజూరు చేసింది. అలాగే మరుగుదొడ్లు, ప్రహరీల నిర్మాణానికి రూ.13 కోట్లు మంజూరయ్యాయి. ఇవి కాకుండా సీపీఎం(సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్) నిధులు రూ. 26 కోట్లు వచ్చాయి. అన్ని కలిపి రూ.121 కోట్లు మంజూరయ్యాయి. ఇప్పటి వరకు రూ.46 కోట్లు వెచ్చించి 100 పాఠశాలల్లో పనులను పూర్తి చేశారు. ఇందుకు సంబంధించి పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు రూ.33 కోట్ల చెల్లింపులు జరిగాయి. ఇంకా రూ.13 కోట్లు చెల్లించాలి. ఈ క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం 'మన ఊరు-మన బడి' కొనసాగింపుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో కాంట్రాక్టర్లు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే చేసిన పనుల బిల్లులు రాకపోవడంతో, కొత్త పనులు చేపట్టేందుకు ముందుకు రావడం లేదు. దీంతో దాదాపు 160 పాఠశాలల్లో పనులు నిలిచిపోయాయి.

### రూ.64 లక్షలు రావాలి..

*దస్తురాబాద్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 'మన ఊరు-మన బడి' కింద రూ.97 లక్షలు వెచ్చించి పాఠశాల భవనాన్ని నిర్మించా. భవనం పూర్తయి నాలుగు నెలలు అవుతున్నది. ఇప్పటి వరకు కేవలం రూ.33 లక్షలు మాత్రమే వచ్చాయి. ఇంకా ప్రభుత్వం నుంచి రూ.64 లక్షలు రావాలి. పేయింటింగ్ వేయని కారణంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు కొత్త భవనాన్ని స్వాధీనం చేసుకోవడం లేదు. దీంతో పెండింగ్ బిల్లులు చెల్లించలేక పోతున్నామని అధికారులు చేతులెత్తేస్తున్నారు. పేయింటింగ్ వేసే బాధ్యతను మరో కాంట్రాక్టర్‌కు అప్పగించారు. ఆయన రంగులు వేయకపోతే అది మా తప్పు కాదు. చేసిన పనులకు బిల్లులు ఇవ్వకపోవడం బాధాకరం. అప్పులు తెచ్చి పనులు చేశాం. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు చెల్లించాలి.*

**- మల్లారెడ్డి, కాంట్రాక్టర్.**

### రూ.30 లక్షలు రావాలే..

*మంజులాపూర్ ఉన్నత పాఠశాలలో ఇప్పటి వరకు రూ.30 లక్షల సొంత డబ్బులు ఖర్చు చేసి పనులు చేశా. ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా రాలేదు. ఇక్కడి పాఠశాలలో క్లాస్‌రూంలతోపాటు మరుగుదొడ్లు, డైనింగ్ హాల్ నిర్మాణ పనులు 40 శాతం పూర్తయ్యాయి. కొన్ని మరమ్మతు పనులను పూర్తి చేశా. ఆయా పనుల కోసం రూ.30 లక్షలు ఖర్చు చేసిన. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులను ఆపేయాల్సి వచ్చింది. ప్రభుత్వం వెంటనే బిల్లులు చెల్లిస్తే పనులు కొనసాగిస్తాం.*

**- అబ్దుల్ హబీబ్, కాంట్రాక్టర్.**

# విద్యార్థిని బలి

- నిర్లక్ష్యం నిండు ప్రాణం తీసింది..
- జ్వరంతో బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థిని మృతి
- రిమ్స్ ఎదుట ఆదివాసీ సంఘాల ఆందోళన
- బాధ్యులను సస్పెండ్ చేయాలని డిమాండ్


మహేశ్వరి(ఫైల్)


జాతీయ రాహదారిపై ఆందోళన చేస్తున్న మహేశ్వరి కుటుంబ సభ్యులు, ఆదివాసీ సంఘాల నాయకులు

ఎదులాపురం, ఫిబ్రవరి 28 : ఆదిలాబాద్ రూరల్ మండలంలోని మామిడిగూడ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్న తొడసం మహేశ్వరి(12) విషజ్వరంతో మృతి చెందింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఈనెల 18వ తేదీ నుంచి మహేశ్వరికి జ్వరం వస్తున్నది. విషయాన్ని హెచ్‌ఎం అశోక్, ఉపాధ్యాయులకు తెలియజేయడంతో ఈనెల 24వ తేదీన అంకోలిలోని పీహెచ్‌సీకి తీసుకెళ్లారు. వైద్యులు మాత్రలు ఇచ్చి పాఠశాలకు పంపించారు. శుక్రవారం పాఠశాల సిబ్బంది తండ్రి నాగుకు ఫోన్ చేసి జ్వరం వచ్చిన విషయాన్ని తెలిపారు. శనివారం నాగు బడికి వచ్చి తన కూతురును రిమ్స్‌కు తీసుకెళ్లి చూపిస్తానని చెప్పాడు. దీంతో హెచ్‌ఎం 'మేమున్నాం.. మేము చూసుకుంటాం.. ఇంటికి వెళ్లిపొండని' అనడంతో తిరుగుముఖం పట్టాడు. మళ్లీ ఆదివారం కూడా పాఠశాలకు వచ్చాడు. రక్త పరీక్షల రిపోర్టులు రావాల్సి ఉందని, సోమవారం వస్తాయని చెప్పడంతో ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం కూడా మళ్లీ పాఠశాలకు వచ్చాడు. కూతురు ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీధర్‌తో మాట్లాడి రిమ్స్‌లో జాయిన్ చేయించాడు. తీవ్ర జ్వరంతో అస్వస్థతకు గురై మహేశ్వరి మంగళవారం అర్ధరాత్రి 12 గంటలకు మృతి చెందిందని వైద్యులు తెలిపారు.

### రిమ్స్ ఎదుట ఆదివాసుల ఆందోళన

విద్యార్థిని మృతికి హెచ్‌ఎం, ఏటీడబ్ల్యూవో నిహారిక కారమణమంటూ ఆదివాసీ సంఘాల నాయకులు కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు రిమ్స్ ఎదుట ప్రధాన రాహదారిపై రాస్తారోకో చేపట్టారు. దీంతో మూడు గంటలపాటు ట్రాఫిక్ జామ్ అయింది. హెచ్‌ఎం, ఏటీడబ్ల్యూవోలను సస్పెండ్ చేయడంతోపాటు బాధిత కుటుంబానికి రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. విషయం తెలుసుకున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి అక్కడికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడేందుకు యత్నించినా ఫలితం లేకుండా పోయింది. కాగా.. ఈ విషయాన్ని ఆదివాసీ సంఘాల నాయకులే కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాకు ఫోన్ ద్వారా వివరించారు. కమిటీ వేసి పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని తెలిపారు. అనంతరం ఆందోళన వద్దకు ఐటీడీఏ డీడీ దిలీప్ కుమార్ చేరుకుని ఘటనపై విచారణ చేయిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. నిరసన కార్యక్రమంలో ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పూసం సచిన్, జేఏసీ కన్వీనర్ బి.రాహుల్, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మెస్రం బాస్కర్, ఏఐఎఫ్‌డీఎస్ నవీన్‌కుమార్, పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి మర్సుకోల అశోక్, తుడుందెబ్బ నాయకులు మనోజ్, సలాం వరుణ్, మాడావి గణేశ్ పాల్గొన్నారు.

## నిర్మల్ పట్టణాభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి..

**నిర్మల్ కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 28 : నిర్మల్ పట్టణాభివృద్ధికి అధికారులు, కౌన్సిలర్‌లు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో 2023-24బడ్జెట్, 2024-25 అంచనాలకు సంబంధించి నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా కాలనీల్లో నెలకున్న సమస్యలను పరిష్కరించాలని కౌన్సిలర్లకు విన్నవించారు. మున్సిపాలిటీ పరిధిలోని సమస్యల పరిష్కారానికి అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. వంద శాతం ఇంటి పన్ను వసూలు చేయాలని, ఇందుకు కౌన్సిలర్లు సహకరించాలని కోరారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, కమిషనర్ రాజు పాల్గొన్నారు.

## ఆరోగ్యంపై దృష్టి సారించాలి..

**నిర్మల్ డీఎంహెచ్‌వో ధన్‌రాజ్**

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 28 : విద్యార్థులు చదువుతోపాటు ఆరోగ్యంపై దృష్టి సారించాలని నిర్మల్ డీఎంహెచ్‌వో ధన్‌రాజ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యల దృష్ట్యా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భీం రావు, జంతుశాస్త్ర అధ్యాపకులు అరుగుల నరేందర్, నుస్రత్ జహాన్, అలిక్ బేగం, సరితా రాణి, పవన్ కుమార్, రమాకాంత్, దిలీప్, నర్సయ్య, నాగేశ్వర్‌రావు, ఉమేశ్, రఘు, మురళీధర్ రావు, రంజిత్, పీజీ రెడ్డి పాల్గొన్నారు.


మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

## 'బుడుందేవ్' కోలాహలం

ఉట్నూర్, ఫిబ్రవరి 28 : శ్యాంపూర్‌లోని బుడుందేవ్ జాతరకు బుధవారం భక్తులు పోటెత్తారు. ఉట్నూర్‌తోపాటు కుమ్రం భీం ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల జిల్లాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. రంగుల రాట్నం, బెల్లి డ్యాన్స్, ఊయలపై చిన్నారులు ఉత్సాహంగా గడిపారు. వారం రోజుల్లో జాతర ముగియనుండడంతో భక్తులు చాలా మంది వస్తున్నారు. ఉట్నూర్ ఎస్ఐ మనోహర్ ఆధ్వర్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


జాతరలో భక్తుల సందడి

## దేవాదాయ శాఖ పరిధిలోకి గండి రామన్న ఆలయం!

**రికార్డులు స్వాధీనం చేసుకున్న అధికారులు**

నిర్మల్ అర్బన్, ఫిబ్రవరి 28 : నిర్మల్ జిల్లా కేంద్రంలోని గండి రామన్న దత్తసాయి ఆలయం దేవాదాయ శాఖ పరిధిలోకి వెల్లనుంది. కొన్నేళ్లుగా ట్రస్టీ (ఇతర వ్యక్తుల) ఆధీనంలో ఉండేదని, దీనిపై కొందరు ఫిర్యాదు చేయడంతో ఉన్నతాధికారులు పలుమార్లు విచారణ చేపట్టారు. విచారణ అనంతరం బుధవారం దేవాదాయ శాఖ అధికారులు రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌చార్జి ఈవోగా రమేశ్‌ను నియమించారు. ఈ తనిఖీల్లో ఆదిలాబాద్ డివిజన్ ఈవో రాజమౌళి, ఈవోలు గోపాల్‌గుప్తా, రవి, రమణారావు, సీనియర్ అసిస్టెంట్ ఆనంద్ పాల్గొన్నారు.


రికార్డులను స్వాధీనం చేసుకున్న అధికారులు